# ‘చదువుకున్న వారికన్నా...’

## 8

పొద్దున్న ఏడున్నరకల్లా హాస్టలుకొచ్చే దోవలో కనుపిస్తుంది ఒక బక్క-పిల్ల. మామిడిచెట్ల క్రిందగా నడిచి వస్తుంది పెద్ద మూటతో. బ్రహ్మాండంగావున్న ‘ఎంప్రెస్‌గేటు’ దాటి యూనివర్సిటీ మహిళా హాస్టలులోకి ప్రవేశిస్తుంది. విశాలంగా పలుచుకునివున్న రావిచెట్టు మొదట్లో తిన్నెలున్నాయి. వాటిమీద మూటదించి, బట్టలు విడదీసి, చిన్న మూటలు కట్టి రూములలోకి వెడుతుంది.

ఆ పధ్నాలుగేళ్ళ చాకలిపిల్ల పేరు సక్కు. ‘విమెన్సుహాస్టలు’ పిల్లలబట్టలు ఎన్ని సంవత్సరాలనుంచో వుతుకుతున్నారు వాళ్ళ కుటుంబం వ్యక్తులు. మోకాలుపైకి చిన్న నేతచీరె బూడిదరంగుది కట్టుకుంటుంది. తల దువ్వుకున్నట్లు కనుపించదు. ఎప్పుడూ ముఖాన నవ్వు తప్పదు.

ఒక్కొ-క్క బ్లాకులో బట్టలు యిస్తూ వస్తుంటుంది. బట్టలు వేసే వాళ్ళు పిలుస్తారు. తీసుకున్నవాళ్ళు పద్దులు చూసుకుంటారు. రెండో బ్లాకులో బట్టలిస్తుంటే, మొదటి బ్లాకులోంచి వినవస్తుంది పిలుపు. “సక్కూ!” అని పిలుస్తారు పొడుగాటి ముస్లిమ్ పిల్లలు. వాళ్ళ పైజిమాల యిస్త్రీ సరిగ్గాలేదు. నాలుగు పైజమాలు తిరిగి యిచ్చి మళ్ళీ చేసుకురమ్మంటారు. “అచ్ఛా అమ్మా!” అంటుంది సక్కు.

ఈలోగా రెండో బ్లాకులోంచి " సక్కూ " అన్న పిలుపు ప్రతి ధ్వనిస్తుంది వరండాల్లో. " అమ్మా " అంటూ పరుగులమీద వెడుతుంది సక్కు.

" ఇదిగో యీబట్టలు పదహారు. ఆ జార్జెట్ రంగు పోయిందంటే వూరుకోను. ఈ నూలుచీరె లన్నిటికీ గంజి బాగా పెట్టుకురావాలి " అని పురమాయిస్తుంది ఒక సీనియరు అమ్మాయి.

" మంచిది అమ్మా " అంటుంది సక్కు నవ్వుతూ.

సక్కు తెచ్చిన బట్టలు చూసుకుంది రుక్మిణి అనే సుందరాంగి. ఆ రోజు ఆవిడ ఫస్టవరు క్లాసుమానేసి, వాళ్ళ బావని కలుసుకోవాలి. చెమ్కీ పూల తెల్ల జార్జెటు కట్టుకుంది క్రిందటిమాటు ఆమె. ఆ బావ మురిసిపోయి, 'వెన్నెల లాగా, మల్లెపూవులాగా, మబ్బుపింజెలాగా వున్నా'వని ఎన్ని మాట్లో అన్నాడు ! ఆనాటి మాటలు తలుచుకుని, తలుచుకుని, రుక్మిణి మనస్సులో ఆరాటపడి పోయింది, ఉతుకుకి వెళ్ళిన ఆ చీరెకోసం. వేళకు ఆ చీరె తెచ్చినందుకు సక్కుని వేయివిధాల ప్రశంసించింది ఆమె.

అద్దంముందు నుంచుని, తెల్లక్రేప్ జాకెట్టుకాలరు సరిచేసుకుని, రెండు జడలకి తెల్ల శాటిన్ రిబ్బన్లు కట్టుకుంది రుక్మిణి. మల్లెపూవు లాంటి ఆ చీరెని ఒంటిమీద వేసుకుని చూసి, సిగ్గుపడుతూ నవ్వి, ఒక్క నిముషంలో కట్టేసుకుంది. కానీ——కానీ——ఆ చీరెమీద...పమిటమీద కాణీ అంత నల్లని మరక ! కళ్లు పెద్దవిచేసి, పరీక్షగా చూసిన రుక్మిణి కోపగించుకుంది. చీకాకుపడింది, చెదరిపోయిన కలను తల్చుకుని ఆమె హృదయం బాధతో స్పందించింది. " సక్కూ ! " అని కోపంగా, గట్టిగా యెలుగెత్తి పిల్చింది. సక్కు వచ్చింది. " ఏమిటిది ? " అని గర్జించింది రుక్మిణి. చిరునవ్వు పోలేదు సక్కు ముఖాన.

" ముందే వుండెను అమ్మా అది " అంది.

'' లేదు లేదు. తీసుకుపో '' అని కోపంతో ఆ చీరె గబగబ విప్పి సక్కు ముఖాన కొట్టి, మరో చీరె తీసుకుంది. సక్కు నిశ్శబ్దంగా నిల్చున్నది. '' మళ్ళీ ఉతుక్కురావాలీ అమ్మా ? " అన్నది మెల్లిగా. రుక్మిణీ రోషంతోవుంది అసలే. "లేకపోతే నన్ను చాకిరేవు పెట్టుకోమంటావా?" అని వురిమి. బొట్టు దిద్దుకోవడంలో నిమగ్నమైంది రుక్మిణి...

సక్కు మరో గదిలోకి వెళ్ళింది.

" ఇదేమిటి సక్కూ ? ఈ జరీచీరె యిస్త్రీ ఏమిటి ? తెల్లబట్టలకి అసలు నీలిమందే వేయడంలేదు '' అన్నది మృదువుగా రోహిణి.

'' అది రాలేదు అమ్మా. నిండా కష్టమైంది యిస్త్రీ చేసేదానికి " అన్నది సక్కు అర్థంలేని చిరునవ్వుతో.

ఓ నిముషమాగి, '' పైసలు యిస్తారమ్మా '' అని అడిగింది సంకోచంతోనే. అలమారు తెరచి డబ్బు యిచ్చేసింది రోహిణి. సక్కు డబ్బు లెక్కపెట్టి అర్థం కానట్లుచూసి, " ఇదేమిటి అమ్మా, సిల్కుచీరకి ఎన్ని పైసలు యిచ్చినారు ? " అన్నది.

" రెండణాలు " అన్నది రోహిణి పరధ్యానంగా. లేతాకుపచ్చ చీరెమీదకి ముదురాకుపచ్చ క్రేపా, నలుపు కణువుచోళియా అన్న సమస్య తేలక అవస్థపడుతోంది ఆమె.

'' అదిఏమిటి అమ్మా. నాల్గుఅణాలు యియ్యాల. అందరు అట్టనే యిస్తారు '' అన్నది సక్కు.

'' ఎవరిస్తున్నారు ? నే నెప్పుడూ యివ్వలేదు '' అన్నది రోహిణి చటుక్కున వెనక్కి తిరిగి.

'' లేదు అమ్మా. నేను అబద్ధం చెప్పలేదు."

" నేనివ్వను " అన్నది రోహిణి. సక్కు ముఖంలో చిరునవ్వు ఒక్క క్షణం మాయమైంది. మరుక్షణంలోనే, " అట్ల చెప్పవద్దు అమ్మా. అన్యాయం సెయ్యవద్దు అమ్మా " అన్నది దీనంగా, అమాయికంగా. కాని వినదు రోహిణి. వినిపించుకోదు. ఆకుపచ్చ చీరె, నల్ల జాకెట్టు తీసుకుని సన్నగా పాడుకుంటోంది ఆమె.

" సక్కూ ! " మూడో బ్లాకులోంచి మరోకంఠం.

" వస్తుంటి అమ్మా. '' అంటుంది సక్కు.

" క్రిందటిమాటు టవల్ బాకీ ఏది ? '' అనడిగింది జడేసుకుంటూ రత్నమాల.

సక్కు నాలిక్కఱచుకుంది. " అరె ! మర్చిపోయాను అమ్మా. రేపు తీసుకువస్తాను " అన్నది.

" సరే. నా నల్లచుక్కల బ్లౌజ్ వుండాలి. కనుపించటంలేదు. ఏమైంది ? " సక్కు అర్థంకానట్లు చూసింది.

" ఏది అమ్మా ? నాకు యిచ్చినారు ? " అన్నది.

" ఔను. ఎప్పుడో వేశాను. ఉండాలి చూడు " అన్నది రత్నమాల.

" లేదు అమ్మా. మాదగ్గర వుంటే ఎక్కడా పోదు. "

" ఉంటుంది చూడు. " అని స్నానానికి పోబోతోంది రత్నమాల.

" అమ్మా. పైసలు యిస్తారూ ? " అంది సక్కు.

" ఇప్పుడు కాదు. రేపు " రత్నమాల వెళ్ళిపోతోంది. సక్కు వెంట వెళ్ళింది.

" మాది నాయన కోపం చేస్తాడు అమ్మా, జరూర్ అనినాడు. ఇవ్వరా అమ్మా ? " అన్నది సక్కు. రత్నమాలకి కోపం వచ్చింది.

"ఇస్తాలే ఫో. ఏమిటి అప్పులదానల్లే గొంతుమీద కూర్చుంటావు? ఇలా గల్లంతుచేస్తే అసలివ్వను" అంటూ విసవిస నడిచింది రత్నమాల

హాస్టలులో గంటకొట్టారు ఫలహారానికి. పిల్లలంతా—గ్రాడ్యుయేట్లు, కాబోయే వైద్యులు, ఉపాధ్యాయులు, ఇంటర్మీడియేట్లు అంతా పోతున్నారు గుంపులు గుంపులుగా. నేతచీరెలు. జార్జెట్లు, షిఫాన్లు, క్రేపులు, ప్రింటింగ్సు. వాయల్సు—రకరకాలు, రంగులురంగులు, చిత్రవిచిత్ర అద్దకాలు అల్లా నడిచిపోతున్నాయి.

చిన్నచిన్న బట్టల మూటలు కట్టుకుంటూ వాళ్ళవంక అలా చూస్తూ నిలబడింది సక్కు. ఆ రంగులు సీతాకోకచిలుకల్ని, పూలతోటల్ని, జ్ఞాపకానికి తెస్తున్నాయి. అవన్నీ, ఆ బట్టలన్నీ తను కాయకష్టంచేసి శుభ్రం చేసింది. స్వహస్తాలతో మడిచి, యిస్త్రీచేసి, పువ్వులకన్న పదిలంగా పట్టుకొచ్చింది.

కాని, కొందరి నూలుచీరెలకి గంజి చాలదు, తెల్లబట్టలకి నీలిమందు చాలదు; మరి కొందరికి యిస్త్రీ సరిపడదు. ఇవ్వాల్సిన డబ్బు యివ్వడం కష్టం కొందరికి. ముస్తాబుతో అసలే తీరిక వుండదు మరి కొందరికి.

ఇవన్నీ తలుచుకుని ఆ 'అమ్మ'ల మీద కసురుకోదు సక్కు. వాళ్ళని మనస్సులోనైనా తిట్టుకోదు. చిరునవ్వుతో అందర్నీ చూస్తూ, పెద్దమూట కట్టుకుంది. నెత్తిమీద బరువుగా పెట్టుకుని, రావిచెట్టు రొదలో కలిసేలా ఏదో కూనిరాగం తీస్తూ నడక ప్రారంభిస్తుంది, "సక్కూ!" అన్న పిలుపు వినిపించినట్లయి వులిక్కిపడి వెనక్కిచూసి, తన భ్రమకి తానే నవ్వుకుంటుంది. బ్రహ్మాండమైన 'ఎంప్రెస్ గేటు' దాటి, మామిడి చెట్టు నీడలో నడిచిపోతుంది సక్కు. [1956]